# నమస్తే తెలంగాణ
# రంగారెడ్డి
I హైదరాబాద్, గురువారం 29 మే 2025 RANGAREDDY




## వీధి దీపాలకు కొత్త టెండర్లు

సిటీబ్యూరో, మే 28 (నమస్తే తెలంగాణ): జీహెచ్ఎంసీ పరిధిలో వీధి దీపాల నిర్వహణకు కొత్త టెండర్లు పిలిచేందుకు స్టాండింగ్ కౌన్సిల్ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. ఈ మేరకు నగరంలో వీధి దీపాల నిర్వహణ బాధ్యతల నుంచి ఈఈఎస్ఎల్ గ్రూప్‌ను తప్పించి... కొత్త ఏజెన్సీకి పనులు బల్దియా అప్పగించనున్నది. ఈఈఎస్ఎల్ నిర్వహణ లోపాలు, కొత్త ప్రతిపాదిత టెండర్ విధి విధానాలు, షరతులు, నిబంధనలపై బల్దియా అధికారులతో స్టాండింగ్ కౌన్సిల్ సభ్యులు, మేయర్ ఆర్వీ కర్ణన్, మేయర్ గద్వాల్ విజయలక్ష్మి చర్చించారు. ఆ ఏజెన్సీకి ఇచ్చిన గడువు ముగియడంతో... టెండర్ ప్రక్రియ చేపట్టేంత వరకు వీధి దీపాల నిర్వహణ, కొనుగోలు వ్యవహారాలను జోనల్ కమిషనర్ల స్థాయిలో చేపట్టాలని మేయర్ గద్వాల్ విజయలక్ష్మి సూచించారు.



వ్యవసాయ, ఇతర శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహిస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి

# నో స్టాక్

- వర్షాలు పడుతుండడంతో విత్తనాలను నాటేందుకు సిద్ధమవుతున్న రైతాంగం
- జిల్లాకు 27 వేల మెట్రిక్ టన్నులకు అందుబాటులో 2609 మెట్రిక్ టన్నుల డీఏపీ
- యూరియా 39 వేల మెట్రిక్ టన్నులకు 8263 మెట్రిక్ టన్నులు
- విత్తనాలు కూడా సరిపోను స్టాక్ లేకపోవడంతో రైతుల ఎదురుచూపులు
- జీలుగ విత్తనాల కోసం దౌల్తాబాద్‌లో రైతుల నిరసన
- జీలుగ, పచ్చిరొట్ట విత్తనాల స్టాక్ లేదంటూ చేతులెత్తేసిన అధికారులు

నైరుతి రుతుపవనాల రాకతో రైతులు సాగుకు సన్నద్ధమవుతున్నారు. ఇప్పటికే దుక్కులు దున్నగా ఎరువులు, విత్తనాలను కొనుగోలు చేసేందుకు సిద్ధమయ్యారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి పెట్టుబడి సాయం అందించకుండా, రుణాలు మంజూరు చేయకుండా రైతులను అప్పులపాలు చేయడంతోపాటు సకాలంలో విత్తనాలు, ఎరువులను అందించడంలోనూ విఫలమైంది. రైతు భరోసా కింద రూ.16 వేల పెట్టుబడి సాయం అందిస్తామని చెప్పి మాట తప్పిన కాంగ్రెస్ సర్కార్.. సకాలంలో విత్తనాలు, ఎరువులను పంపిణీ చేసేందుకు ఎలాంటి చర్యలు తీసుకోవడంలేదు. జిల్లాలో అవసరమైన విత్తనాలు, ఎరువులకు సంబంధించి జిల్లా వ్యవసాయ శాఖ ప్రణాళికను రూపొందించినప్పటికీ జిల్లాకు స్టాక్ మాత్రం ఇంకా రాకపోవడం గమనార్హం. జీలుగ, పచ్చిరొట్ట విత్తనాలకు సంబంధించి కూడా సరిపోను స్టాక్ లేకపోవడంతో రైతులు వ్యవసాయ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. బుధవారం దౌల్తాబాద్‌లో జీలుగ విత్తనాల కోసం రైతులు అధిక సంఖ్యలో రావడంతో కొంత తోపులాట జరిగింది. వంద మందికిపైగా రైతులకు విత్తనాలు దొరకకపోవడంతో నిరసన వ్యక్తం చేశారు. అధికారులు స్టాక్ అయిపోయిందంటూ చేతులెత్తేశారు.

**- వికారాబాద్, మే 28 (నమస్తే తెలంగాణ)**



### వానకాలం సాగు 5.61 లక్షల ఎకరాలు

జిల్లాలో వానకాలం సాగు 5.61 లక్షల ఎకరాల్లో అవుతుందని జిల్లా వ్యవసాయశాఖ ప్రణాళికను సిద్ధం చేసింది. అత్యధికంగా పత్తి 2.58 లక్షల ఎకరాల్లో, కందులు 1.13 లక్షలు, వరి 1.31 లక్షలు, మొక్కజొన్న 26,908., పెసలు 14,568., మినుములు 5716., జొన్నలు 2500 ఎకరాల్లో సాగవుతుందని పేర్కొన్నది. పత్తి విత్తనాలకు సంబంధించి 5.50 లక్షల ప్యాకెట్లు, వరి 32,769 క్వింటాళ్ల విత్తనాలు, జొన్న 206 క్వింటాళ్లు, మొక్కజొన్న 2153., సోయాబీన్ 613., మినుములు 457., పెసలు 1165., కందులు 4534 క్వింటాళ్ల విత్తనాలు అవసరమని అధికారులు అంచనా వేశారు.

జిల్లాలో రైతులు దుక్కులు దున్ని విత్తనాలను నాటేందుకు సిద్ధంగా ఉన్నప్పటికీ ప్రభుత్వం మాత్రం ఎరువులు, విత్తనాలను జిల్లాలకు సరిపోను స్టాక్‌ను తరలించలేదు. విత్తనాలను నాటే ముందు కావాల్సిన డీఏపీ ఎరువులకు సంబంధించి కేవలం పది శాతం మాత్రమే స్టాక్ ఉండడం గమనార్హం. డీఏపీని రైతులు కొనుగోలు చేస్తే కేవలం రెండు, మూడు రోజుల్లోనే ప్రస్తుతం జిల్లాలో అందుబాటులో ఉన్న స్టాక్ పూర్తవుతుంది. తదనంతరం డీఏపీ కోసం రైతులు ధర్నాలు చేయాల్సిన పరిస్థితులు నెలకొనే ప్రమాదమున్నది. వానకాలం సీజన్‌కుగాను 27 వేల మెట్రిక్ టన్నుల యూరియా అవసరమని వ్యవసాయాధికారులు అంచనా వేయగా, ఇప్పటి వరకు అందుబాటులో కేవలం 2609 మెట్రిక్ టన్నుల డీఏపీ మాత్రమే అందుబాటులో ఉన్నది. మిగతా స్టాక్ ఎప్పుడు వస్తుందనేది ఇప్పటివరకు సంబంధిత అధికారులకు ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పష్టత లేదు. డీఏపీ కోసం రోజుల తరబడి క్యూ లైన్లలో బారులు తీరాల్సిన పరిస్థితులున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. యూరియాకు సంబంధించి జిల్లాకు 39 వేల మెట్రిక్ టన్నుల యూరియా అవసరంకాగా, ఇప్పటివరకు 8263 మెట్రిక్ టన్నుల యూరియా మాత్రమే అందుబాటులో ఉంది. పొటాషియం 8 వేల మెట్రిక్ టన్నులు అవసరంకాగా, ఇప్పటివరకు కేవలం 175 మెట్రిక్ టన్నులు మాత్రమే అందుబాటులో ఉన్నది.

# కల్తీ విత్తనాల కట్టడికి..

- జిల్లాస్థాయిలో టాస్క్‌ఫోర్స్ కమిటీలు
- రంగారెడ్డి కలెక్టర్ నారాయణరెడ్డి
- కల్తీకి పాల్పడితే పీడీ యాక్టు కింద కేసులు నమోదు
- రైతులు గుర్తింపు పొందిన విత్తన కంపెనీల వద్దే విత్తనాలు కొనుగోలు చేయాలి

రంగారెడ్డి, మే 28 (నమస్తే తెలంగాణ) : వర్షాకాలం పంటల సీజన్ ప్రారంభమవుతున్న నేపథ్యంలో జిల్లాలో నకిలీ విత్తన కంపెనీలపై అధికార యంత్రాంగం దృష్టి సారించింది. ఈమేరకు రంగారెడ్డి కలెక్టర్ నారాయణరెడ్డి నేతృత్వంలో జిల్లాలో రెండు టాస్క్‌ఫోర్స్ కమిటీలను కూడా ఏర్పాటు చేశారు. జిల్లా టాస్క్‌ఫోర్స్ కమిటీల ఆధ్వర్యంలో నకిలీ విత్తనాల విక్రయదారులపై కఠిన చర్యలు తీసుకునేందుకు పూర్తిస్థాయి అధికారం ఇచ్చారు. డివిజనల్, మండల స్థాయిలో కూడా ప్రత్యేక టీంలను ఏర్పాటు చేస్తున్నారు. డివిజన్ స్థాయిలో ఆర్డీవో, ఏడీఏ, ఏసీపీల ఆధ్వర్యంలో.. మండల స్థాయిలో తహసీల్దార్, వ్యవసాయాధికారి, సీఐల నేతృత్వంలో కమిటీలు ఏర్పాటు కానున్నాయి. ఈ కమిటీల ఆధ్వర్యంలో జిల్లాలోని ఫెర్టిలైజర్ దుకాణాల్లో విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తారు. విత్తన కంపెనీలపై కూడా తనిఖీలు చేపట్టనున్నారు. జిల్లాస్థాయిలో టాస్క్‌ఫోర్స్ కమిటీలతోపాటు ప్రత్యేక స్క్వాడ్‌లు నిర్విరామంగా పనిచేయనున్నాయి. ముఖ్యంగా వ్యవసాయాధికారులు నకిలీ విత్తనాల పట్ల రైతులను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయాలని కలెక్టర్ ఆదేశించినందున అందుకనుగుణంగా ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నారు. రైతులకవసరమైన నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు.

### నకిలీ విత్తనాలను అరికట్టాలి

రైతుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని వారికి నకిలీ విత్తనాలు అమ్మినట్లు తెలిస్తే వారిపై పీడీ యాక్టు నమోదు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈమేరకు కలెక్టర్ బుధవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో వ్యవసాయాధికారులు, పోలీసులు, టాస్క్‌ఫోర్స్ అధికారులతో బుధవారం సమావేశం ఏర్పాటు చేశారు. ఎక్కడా నకిలీ విత్తనాలు కనిపించకుండా చేయాలన్నారు. వర్షాకాలంలో జిల్లాలో ఎక్కువ మంది రైతులు పత్తి, వరి, మొక్కజొన్న, ఇతర కూరగాయల పంటలతోపాటు ఆముదం పంట కూడా వేయనున్నారు. యాచారం, మంచాల, మాడ్గుల, తలకొండపల్లి, ఆమగనల్లు, కడ్తాల్, షాద్‌నగర్, కేశంపేట, కొందుర్గు, షాబాద్, చేవెళ్ల, మొయినాబాద్ వంటి ప్రాంతాల్లో రైతులు పంటలు అధికంగా వేయనున్నందున నకిలీ విత్తనాలు విక్రయించే అవకాశమున్నట్లు అధికారులు గుర్తించారు. దీనిని దృష్టిలో ఉంచుకుని అధికారులు, టాస్క్‌ఫోర్స్ కమిటీలు ఈ ప్రాంతాల్లో ఎక్కువగా దాడులు చేసి నకిలీ విత్తనాలను అరికట్టాలని కలెక్టర్ ఆదేశించారు.

### రైతులు విత్తనాల కొనుగోళ్లల్లో జాగ్రత్తలు పాటించాలి

**- వ్యవసాయాధికారి నర్సింహారావు**

* వర్షాకాలం నేపథ్యంలో రైతులు నాణ్యమైన విత్తనాలు ఎంపికచేసుకోవాలి.
* లైసెన్స్ కలిగిన డీలర్ల వద్దనే కొనుగోలు చేయాలి.
* తప్పనిసరిగా కొనుగోలుకు సంబంధించిన బిల్లులు తీసుకోవాలి.
* బిల్లులపై డీలర్ల సంతకాలూ ఉండాలి.
* బిల్లును పంటకాలం పూర్తయ్యే వరకు భద్రపర్చుకోవాలి.
* అవసరమైనప్పుడు ఈ బిల్లు ఆధారంగా ఉంటుంది.
* ముఖ్యంగా పత్తి విత్తనాల విషయంలో అప్రమత్తంగా ఉండాలి.
* గడ్డి మందును తట్టుకునే రకాలు అంటూ బీటీ–3 విత్తనాలు అమ్ముతున్న వారిని గుర్తించిన వెంటనే అధికారులకు సమాచారమివ్వాలి.

కల్తీ విత్తనాలు, అమ్మినా లైసెన్స్ లేకుండా విత్తనాల వ్యాపారం చేసినా హెచ్‌టీ పత్తి, బీటీ–3 విత్తనాలమ్మినా జిల్లాస్థాయి విత్తన కంట్రోల్ రూం ఫోన్ నం.9398304336కు సమాచారమివ్వాలని జేడీఏ సూచించారు.

## తడిసిన ధాన్యం కొనక ఇబ్బందులు

కులకచర్ల : ధాన్యం కొనుగోలు చేయడంలో సెంటర్ల నిర్వాహకుల నిర్లక్ష్యం వహించడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. చౌడాపూర్ మండలం అడవి వెంకటాపూర్‌లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో సక్రమంగా కొనుగోలు చేయకపోవడంతో రైతులు ధాన్యాన్ని నిల్వ ఉంచుకోవడం వలన వర్షాలకు తడిసి మొలకలొస్తున్నాయి. గత ప్రభుత్వంలో ముందుగానే ప్రణాళిక ప్రకారం ధాన్యాన్ని తీసుకునేవారని, నేడు సరైన సమయానికి తీసుకోకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని రైతులు పేర్కొంటున్నారు. పీఏసీఎస్ కేంద్రాల్లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో కూడా దిక్కులేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### సెంటర్ల దగ్గరే నిలువ ఉన్న ధాన్యం

కులకచర్ల, చౌడాపూర్ మండలాల పరిధిలోని కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యాన్ని రైతులు నిల్వ ఉంచారు. ధాన్యాన్ని సెంటర్‌ల నిర్వాహకులు సేకరించకపోవడంతో రైతులు కేంద్రాల వద్దే తమ ట్రాక్టర్లకు తాడ్‌పత్రీలను కట్టి ధాన్యాన్ని తడువకుండా ఉండేందుకు చాలా విధాలుగా ప్రయత్నాలు చేస్తున్నారు. సెంటర్లకు తీసుకువచ్చిన ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు కేంద్రం నిర్వాహకులు వివిధ ఆంక్షలు పెడుతున్నారని తెలియజేస్తున్నారు. ఒక్కొక్క కొనుగోలు కేంద్రం వద్ద రైతులు సుమారు 15 రోజుల నుంచి నిరీక్షణ చేస్తున్నట్లు పేర్కొన్నారు. తీసుకువచ్చిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు నిర్వాహకులు తీసుకోవాల్సి ఉండగా గన్నీ బ్యాగులు లేవని, లారీలు రావడం లేదని చెపుతున్నారు. దీంతో కేంద్రాల్లో వర్షానికి ధాన్యం తడుస్తున్నది.

### సెంటర్లలోనే మొలకెత్తిన ధాన్యం

కులకచర్ల, చౌడాపూర్ మండలాల పరిధిలోని వివిద ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం నిల్వ ఉండటం వలన ధాన్యం వర్షానికి తడువడంతో ధాన్యం మొలకెత్తుతున్నది. రైస్ మిల్లర్లు పెట్టే షరతులకు కూడా ఇబ్బందులకు గురవుతున్నట్లు రైతులు పేర్కొంటున్నారు.

### డబ్బులు రావడంలేదు



అడవివెంకటాపూర్ గ్రామంలో కొనుగోలు కేంద్రంలో 15 రోజులకు ముందుగా ధాన్యాన్ని వేశాం. ధాన్యాన్ని రైస్ మిలేకలకు కూడా పంపించారు. కాని మాకు డబ్బులు ఇప్పటివరకు రావడంలేదు. ఇదేమని అడిగితే అక్కడే సమస్య ఉందని సెంటర్ నిర్వాహకులు పేర్కొంటున్నారు. ధాన్యం అమ్మి 15 రోజులు అవుతున్నా డబ్బులు రాలేదు. దీనిపై జిల్లా అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలి. గతంలో వారంలోనే డబ్బులు వచ్చేవి. కాని నేడు మా పరిస్థితి అధ్వానంగా తయారైంది.

**- రవినాయక్, మాజీ సర్పంచ్, గోగ్యానాయక్‌తండా**



### ధాన్యానికి మొలకలు వస్తున్నాయ్..

ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చిన ధాన్యాన్ని తీసుకోకపోవడంతో కేంద్రాల దగ్గరే ధాన్యాన్ని నిల్వ ఉంచారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు ధాన్యం తడిసి మొలకలు వస్తున్నాయి. ప్రభుత్వం రైతులను ఆదుకోవాలి. వెంటనే ధాన్యాన్ని కొనుగోలు చేసి రైస్ మిల్లులకు పంపించి డబ్బులు వచ్చేలా చూడాలి. **- జుబేర్, మాజీ కోఆప్షన్ సభ్యుడు**



అయినాపూర్‌లో మొలకెత్తిన వరి ధాన్యంతో రోడ్డుపై నిరసన తెలుపుతున్న రైతులు

# మొలకెత్తిన ధాన్యం.. రైతన్న దైన్యం

- రెండు రోజులకో లారీ రావడంతో నత్తనడకన కొనుగోళ్లు
- వర్షానికి తడిసి ముద్దవుతున్న ధాన్యం
- అధికారులు స్పందించకపోవడంతో నిరసన తెలుపుతున్న అన్నదాతలు
- మిల్లర్లు, అధికారుల మధ్య లోపించిన సమన్వయం

దోమ, మే 28 : రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన వరి ధాన్యం వర్షానికి తడిసి మొలకలు రాగా.. కొనుగోలు చేయకపోవడంతో రైతులు రోడ్డెక్కిన ఘటన బుధవారం దోమ మండల పరిధిలోని అయినాపూర్ గ్రామంలో నెలకొన్నది. అయినాపూర్ గ్రామ పెద్ద చెరువు ఆయకట్టు కింద రైతులు పెద్దఎత్తున వరి పంటను సాగు చేసి మంచి దిగుబడులను సాధించారు. పండించిన వరి ధాన్యాన్ని అమ్ముకుందామని గ్రామంలో ఏర్పాటు చేసిన ఐకేపీ కొనుగోలు కేంద్రానికి తీసుకురాగా.. అధికారులు మాత్రం రెండు రోజులకు ఒక లారీని పంపడంతో కొనుగోళ్లు నత్తనడకన సాగుతున్నాయి. దానికి తోడు వర్షాలు కురవడంతో ధాన్యం తడిసి మొలకలు వచ్చినా సంబంధిత అధికారులు స్పందించకపోవడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మిల్లర్లు, అధికారుల మధ్య సమన్వయం లేకనే రైతులకు ఇలాంటి పరిస్థితి దాపురించిందని అన్నదాతలంటున్నారు. తడిసిన వడ్లను సైతం కొంటామని ప్రగల్భాలు పలుకుతున్న మంత్రులు, ఎమ్మెల్యేలకు ఈ దుస్థితి కనిపించడం లేదా? అని ప్రశ్నిస్తున్నారు. అధికారులు స్పందించి వరి ధాన్యం అయిపోయే వరకు రోజుకో లారీని పంపించి కొనుగోళ్లు సజావుగా జరిగేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

### ట్రాన్స్‌పోర్ట్ అధికారులు స్పందించాలి



వరి ధాన్యం కొనుగోళ్లలో భాగమైన ట్రాన్స్‌పోర్ట్ అధికారులు నిద్ర మత్తులో ఉండి రైతులు పండించిన పంటను కొనుగోలు కేంద్రాల నుంచి మిల్లులకు తరలించడంలో ఆలస్యం చేయడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ప్రజా ప్రభుత్వం అని చెప్పుకొంటున్న కాంగ్రెస్ పార్టీ రైతులను అవస్థలకు గురిచేస్తూ అన్యాయం చేయడం బాధాకరంగా ఉన్నది. ఇప్పటికైనా అధికారుల్లో మార్పు రావాలి.. రైతులకు మేలు జరగాలి.

**- మేకల శ్రీనివాస్, రైతు అయినాపూర్**

### తడిసిన వడ్లను కొని రైతులను ఆదుకోవాలి



పండించిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రోజుల తరబడి కుప్పలు పోసి ఉంచడం వల్ల నష్టపోవడం ఒక ఎత్తయితే.. దానికి వర్షం తోడై ధాన్యం తడిసి మొలకలు వచ్చి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. సర్కారు గుర్తించి తడిసిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేసి రైతులకు నష్టం కలుగకుండా చర్యలు తీసుకోవాలి. ప్రభుత్వం మాటలు చెప్పడంకాదు.. తడిసిన ధాన్యాన్ని కొని రైతులను ఆదుకోవాలి.

**- పొట్ట రాములు, రైతు, అయినాపూర్**

# వీవోఏ చేతివాటం

పరిగి, మే 28 : పరిగి మండలం రంగాపూర్ గ్రామంలో 15 మహిళా సంఘాలుండగా పరిగి పట్టణంలోని ఎస్‌బీఐ మెయిన్ బ్రాంచ్‌లో 5 సంఘాలకు ఆయా సంఘాలవారీగా రూ.5లక్షల నుంచి రూ.10లక్షలకు పైగా సైతం బ్యాంకు రుణాలను వీవోఏ యాదయ్య ఇప్పించారు. ఇక్కడివరకు అంతా బాగానే ఉన్నా రుణాలిప్పించినందుకు లక్షకు వెయ్యి రూపాయల చొప్పున వసూళ్లకు పాల్పడుతున్నారని పేర్కొంటూ రంగాపూర్ గ్రామ మహిళలు నిరసన తెలిపారు. వీవోఏ వసూళ్లకు పాల్పడడంతోపాటు తమ పట్ల చులకనగా ప్రవర్తిస్తారని మహిళలు ఆరోపించారు. ఈ విషయమై నిలదీస్తే ఎవరికి చెప్పుకుంటారో చెప్పుకోండని అంటారన్నారు. తమకు రుణాలు వద్దని చెప్పినా ఇప్పించారని వారు వాపోయారు. యాదయ్యపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈమేరకు ఐకేపీ ఏపీఎం శ్రీనివాస్‌రెడ్డి విచారణ జరిపారు. విచారణ నివేదికను డీఆర్‌డీవోకు అందజేయడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు.



నిరసన తెలుపుతున్న రంగాపూర్ గ్రామ మహిళలు



ముజాహిద్‌పూర్ కొనుగోలు కేంద్రంలో తడిసిన ధాన్యం సంచులు




ముజాహిద్‌పూర్ కొనుగోలు కేంద్రంలో నిల్వ ఉంచిన ధాన్యం బస్తాలు

**శ్రీశైలం ఎడమగట్టు కాల్వ పథకానికి (ఎస్ఎల్‌బీసీ) రూ.1500 కోట్లు ఖర్చు చేస్తే కృష్ణాజలాలు అక్కంపల్లి రిజర్వాయర్‌లో వచ్చిపడతాయి. కేసీఆర్ ఈ సుంకిశాల పథకాన్ని ఎందుకు తెరపైకి తెచ్చారో అర్థం కావడం లేదు. ఇది అనవసర ప్రాజెక్టు..**

**సుంకిశాల రిటెయినింగ్ వాల్ కూలిన సందర్భంగా శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలివి. ఎలిమినేటి మాధవరెడ్డి ప్రాజెక్టులో ఐదో మోటారు ఏర్పాటు చేయాలి. దాని ద్వారా కృష్ణాజలాల్ని ఎత్తిపోసి నేరుగా లింక్ కెనాల్‌లోగానీ జలమండలికి చెందిన కోదండాపూర్ ట్రీట్‌ప్లాంటుకుగానీ తరలించాలి.**

**సుంకిశాలకు ప్రత్యామ్నాయంగా నీటి పారుదల శాఖ ఇంజినీర్లు పలు దఫాలుగా రూపొందించిన ప్రతిపాదనలు ఇవి.**



# సిటీకి సుంకిశాలే శరణ్యం

## కేసీఆర్ దిశలోనే కాంగ్రెస్ సర్కారు.. ఏప్రిల్‌లోగా ప్రాజెక్టు పూర్తి చేసేలా కార్యాచరణ

సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి, మే 28 (నమస్తే తెలంగాణ): నాగార్జునసాగర్ జలాశయంలో డెడ్ స్టోరేజీ నుంచి కూడా హైదరాబాద్ మహా నగరానికి శాశ్వత ప్రాతిపదికన నీటిని తరలించే సుంకిశాల పథకాన్ని అటకెక్కించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వంలో చోటుచేసుకున్న పరిణామాలకు ఉదాహరణ మాత్రమే ఇవి. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో ఎంతో ముందుచూపుతో ఈ పథకాన్ని చేపట్టి 80 శాతానికి పైగా పనులను సైతం పూర్తి చేయగా, రిటెయినింగ్ వాల్ కుప్పకూలిన తర్వాత ప్రభుత్వం అనేక ప్రత్యామ్నాయాల్ని అన్వేషించింది. కానీ అవేవీ ఆచరణ సాధ్యం కాదని తేలడంతో ఇప్పుడు కేసీఆర్ హయాంలో చేపట్టిన సుంకిశాల పథకాన్నే పూర్తి చేయడం అనివార్యంగా మారింది. గత ఏడాది పుష్కలమైన వరద వచ్చి సముద్రంలో జలాలు కలిసినప్పటికీ హైదరాబాద్ తాగునీటి కోసం జలమండలి అత్యవసర మోటార్లను ఏర్పాటు చేయాల్సిన విషమ పరిస్థితి ఏర్పడింది. ఈ నేపథ్యంలో సుంకిశాలను పూర్తి చేసేందుకు జలమండలి ప్రత్యేక కార్యాచరణ రూపొందించుకుంది. గత అనుభవాల దృష్ట్యా సాంకేతిక ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు సాగునీటి ప్రాజెక్టుల్లో గేట్లను ఏర్పాటు చేయడంలో ప్రత్యేక నిపుణులు కన్నయ్య నాయుడిని రంగంలోకి దింపారు. ఎండీ అశోక్‌రెడ్డి రెండు రోజుల కిందట కన్నయ్యనాయుడితో కలిసి సుంకిశాల పథకం పనుల వద్దకు వెళ్లి పరిశీలించారు. నిర్మాణ సంస్థ, ఇంజినీర్లతో సమావేశాన్ని ఏర్పాటు చేసి ఏప్రిల్‌లోగా పథకాన్ని పూర్తి చేసేందుకుగాను రూట్‌మ్యాప్‌ను రూపొందించారు.

హైదరాబాద్ మహా నగరంలో తాగునీటి సరఫరా వ్యవస్థలో సుమారు 48 శాతం వరకు కృష్ణాజలాలే ఉంటాయి. ఇంత కీలకమైన జలాలను నాగార్జునసాగర్ రిజర్వాయర్ నుంచి సేకరిస్తారు. నల్లగొండ జిల్లాలోని ఎలిమినేటి మాధవరెడ్డి ప్రాజెక్టులోని మోటార్ల ద్వారా ఎత్తిపోసి... అటు నుంచి జలమండలి కోదండాపూర్ వద్ద నిర్మించిన నీటి శుద్ధి కేంద్రానికి తరలించి శుద్ధి చేసిన తర్వాత నగరానికి పైపులైన్ల ద్వారా తీసుకువస్తారు. అయితే సాగర్‌లో 510 అడుగుల నీటిమట్టం ఉంటేనే మాధవరెడ్డి ప్రాజెక్టులోని మోటార్ల ద్వారా సాఫీగా జలాల ఎత్తిపోత సాధ్యమవుతుంది. నీటిమట్టం తగ్గేకొద్దీ సరఫరా అంతరాయం కలుగుతుంది. అందుకే ప్రతి ఏటా వేసవి వచ్చే వరకు జలమండలి అత్యవసర

(మిగతా IVవ పేజీలో)